జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 17 | డిసెంబర్ | 2025 ◆ పేజీలు : 5



## తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 16, ప్రజా జ్యోతి** జిల్లాలో తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలను పూర్తి స్థాయిలో, ప్రశాంత వాతావరణంలో

మిగతా 2 లో...



## బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ లో మరికొన్ని పరిశ్రమలు సంక్రాంతి నాటికి ప్రారంభం

- ఫుడ్ పార్క్ పురోగతి పై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తో కల్సి మంత్రి తుమ్మల సమీక్ష
- ఫుడ్ పార్క్ లో మౌలిక సదుపాయాలు కల్పన వేగంగా జరిగేలా అధికారులకు దిశా నిర్దేశం
- ఫుడ్ పార్క్ లో 615 కోట్లు ఆక్వా ప్రాజెక్ట్ పెట్టుబడులు పెట్టనున్న దీపక్ నెక్స్ జెన్ గ్రూఫ్
- బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ కు రూపకల్పన చేసిన మంత్రి తుమ్మల
- 2016 లో శంకుస్థాపన
- రోడ్ రైల్వే పోర్ట్ కనెక్టివిటీ ఉండేలా స్ట్రాటజిక్ లొకేషన్ లో ఫుడ్ పార్క్ ఏర్పాటులో మంత్రి తుమ్మల ముద్ర
- వ్యవసాయ ఉద్యాన ఆక్వా పౌల్ట్రీ రంగాలకు కీలకంగా మారనున్న ఫుడ్ పార్క్
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంప్లాయిమెంట్ హబ్ గా మారనున్న బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్

**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 16, ప్రజా జ్యోతి:** ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగంలో గేమ్ చేంజర్ గా బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ మారనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.మంగళవారం సచివాలయం లో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి ఫుడ్ పార్క్ పురోగతి పై సమీక్ష నిర్వహించారు, బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పీ. ఎం కె.ఎస్ వై పథకంలో భాగంగా సత్తుపల్లి మండలం బుగ్గపాడు లో 2016 ఫిబ్రవరి 5 వ తేదీన ఆమోదం తెలిపారు. 60 ఎకరాల విస్తీర్ణంలో

మిగతా 2 లో...




## పాండురంగపురం రైతు వేదికలో భారీ చోరీ

- పాండురంగపురం రైతు వేదికలో భారీ చోరీ
- ప్రభుత్వ ఆస్తులు పక్కదారి పోతున్నా పట్టించుకునే నాథుడు లేరా......?
- చోరీ జరిగి రోజులు గడుస్తున్నా అధికారులు నిర్లక్ష్యమా.....?
- ఇది మీకు తగునా....?
- ఏఈఓ కు అధికారులే కొమ్ము కాస్తున్నారంటూ వదంతులు
- చోరీ జరిగింది కొంత
- తీగ లాగి డొంకను కదిలిస్తే మరింత
- ప్రజా జ్యోతి కథనానికి స్పందించిన ఏడిఈ
- చోరీ ఘటనపై విచారణకు వచ్చి వెళ్లిన ఏడిఈ
- విచారణలో రుజువులు తేలినా
- వివరణ ఇవ్వని అధికారి
- ఎన్నికల వేళ మెడికల్ లీవ్ పేరుతో తప్పించుకున్న ఏఈఓ
- చోరీపై డిఏఓ నిజ నిజాలు వెలికి తీయగలరా......?

**పాల్వంచ (టౌన్), డిసెంబర్ 16 (ప్రజా జ్యోతి):**పాల్వంచ మండల పరిధిలోని పాండురంగపురం గ్రామపంచాయతీలో ఉన్న రైతు వేదికలో రూ.2.50 లక్షల విలువైన ప్రభుత్వ వస్తువులు చోరీకి గురైన ఘటన కలకలం రేపుతోంది.ఈ ఘటనపై బాధ్యత వహించాల్సిన అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ (ఏఈఓ) అనురిక నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.వరుసగా చోరీలు జరుగుతున్నా ఏఈఓ అనురిక ఎందుకు అప్రమత్తం కాలేదన్న

మిగతా 2 లో...

## 34 మంది మావోయిస్టుల లొంగుబాటు



- 26 మంది మావోయిస్టులపై 84 లక్షల రివార్డ్
- రెండేళ్లలో 824 మంది మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల, డిసెంబర్ 16:(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మంగళవారం ముప్పై నాలుగు మంది నక్సలైట్లు లొంగిపోయారు. వీరిలో ఏడుగురు మహిళలు, 27 మంది పురుష కేడర్లు ఉన్నారు. ఈ కేడర్లు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డి కె ఎస్ జెడ్ సి )

మిగతా 2 లో...

- ఇల్లందు - 27, టేకులపల్లి - 36, గుండాల - 9, ఆళ్లపల్లి - 10 జీపీలకు ఎన్నికలు
- ఇల్లందు 2, గుండాల 2, ఆళ్లపల్లి 2 పంచాయితీలు ఏకగ్రీవం
- 82 సర్పంచులకు గాను 265 మంది పోటీ
- 522 వార్డులకు జరగనున్న ఎన్నికలు




## నేడే తుది పోరు

**ఇల్లందు, డిసెంబర్ 16, ప్రజాజ్యోతి:** ఇల్లందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. 82 సర్పంచులకు గాను 265 మంది పోటీలో ఉన్నారు. ఇల్లందులోని సుభాష్ నగర్, ధనియాలపాడు, గుండాలలో మామకన్ను, దామరతోగు, ఆళ్లపల్లిలో అడవిరామారం, దొంగతోగు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. అదేవిధంగా ఈ నాలుగు మండలాల్లో

మిగతా 2 లో...

## నేడే తుది పోరు

(మొదటి పేజీ తరువాయి...)

522 వార్డు సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బంది నియామకం, సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ల నియామకాలు పూర్తయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల వసతులను సైతం ఏర్పాటు చేశారు.

**సామాగ్రి పంపిణీ :** తుది విడత ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులకు మంగళవారం పట్టణంలోని జెకె కాలనీ బ్లాక్ డైమండ్ స్టేడియంలో కేంద్రాలను ఏర్పాటు చేసి బ్యాలెట్ బాక్స్ లు, బ్యాలెట్ పత్రాలతో పాటు ఇతర సామాగ్రిని అందించగా పోలింగ్ సిబ్బంది బస్సులు, టాటా మ్యాజిక్ వాహనాలలో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు.

**కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు :** గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ముగిశాక అక్కడే ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు. లెక్కింపు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తిచేసేలా అవసరమైన ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోనే తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ లను ఏర్పాటు చేసి పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు, సామాగ్రిని అందులోనే భద్రపర్చనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి లెక్కింపు ప్రారంభించి ఫలితాలను ప్రకటిస్తారు.

**కట్టుదిట్టమైన బందోబస్తు:** మూడో విడత ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇల్లందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో 650 మంది పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని డిఎస్పీ కోరారు.

## పాండురంగపురం రైతు వేదికలో భారీ చోరీ

(మొదటి పేజీ తరువాయి...)

ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతు వేదికలో మాయమైన వస్తువులు ప్రభుత్వ,ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసినవన వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు ప్రజా ధనాన్ని కాపాడే ఉద్దేశమే లేకుండా వ్యవహరిస్తున్నారా..? అధికారుల అండదండాల ధీమాతోనే ఈ నిర్లక్ష్యం కొనసాగుతోందా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**విచారణకు హాజరుకాని ఏఈఓ:**

వరుస దొంగతనాల నేపథ్యంలో పాండురంగపురం రైతు వేదిక నిధుల నిర్వహణ బాధ్యత వహిస్తున్న ఏఈఓ అనురికపై వివరణ కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులు డిసెంబర్ 11 (గురువారం) నోటీసులు జారీ చేశారు.అయితే, ఆ నోటీసులను ధిక్కరిస్తూ ఏఈఓ విచారణకు హాజరుకాలేదు. వివరణ కూడా ఇవ్వకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది.డిసెంబర్ 16 (మంగళవారం) ఏడిఏ సుధాకర్ రెండోసారి వివరణ కోరినా,దానినీ నిరాకరించిన ఏఈఓ అనురిక, తన భర్త ద్వారా విచారణ తేదీ మార్చాలంటూ లేఖ పంపినట్లు సమాచారం. ఈ మౌనం నేరాన్ని అంగీకరించినట్టేనా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.దొంగతనం వెనుక ఏఈఓ ముందస్తు ప్రణాళికతోనే రైతు వేదిక హాల్ నుంచి కో–ఆర్డినేటర్ రూమ్ తలుపులు తెరిచి ఉంచి దొంగతనానికి అవకాశం కల్పించారా..? అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసుల విచారణలో కూడా "మీ ఇంటి దొంగలను ఈశ్వరుడు కూడా పట్టుకోలేడు" అన్న వ్యాఖ్యలు రావడం గమనార్హం.

**మండల అగ్రికల్చర్ ఆఫీసర్ శంభో శంకర్ వివరణ:**

శంభో శంకర్ (మండల అగ్రికల్చర్ ఆఫీసర్,పాల్వంచ) ఈ ఘటనపై స్పష్టమైన వివరాలు వెల్లడించారు.

రాష్ట్రంలో ప్రతి మంగళవారం రైతు వేదికల్లో 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.నవంబర్ 11 (మంగళవారం) కార్యక్రమానికి ముందు రోజు,అంటే నవంబర్ 10 (సోమవారం) పాండురంగపురం ఏఈఓ అనురిక సెలవు కోరారని చెప్పారు.రైతు వేదికకు సంబంధించిన రెండు జతల తాళాల్లో ఒక జతను ఆమె స్వయంగా రాకుండా మరో వ్యక్తి ద్వారా అగ్రికల్చర్ కార్యాలయానికి పంపించి, అక్కడి మహిళా ఉద్యోగికి అప్పగించారని తెలిపారు. తాళాలు ఇచ్చినట్లు రిసీవ్డ్ కాపీ తీసుకెళ్లడం అనుమానాస్పదంగా అనిపించిందన్నారు. మరుసటి రోజు రైతు నేస్తం కార్యక్రమానికి మరో ఏఈఓను పంపించి,తాళలు తెరిచే సమయంలో వీడియో తీయమని సూచించామని చెప్పారు. తలుపులు తెరిచిన వెంటనే గోడకు ఉండాల్సిన 64 అంగుళాల టీవీ కనిపించలేదని తెలిపారు.గతంలో కూడా ఇదే రైతు వేదికలో ఇన్వర్టర్,సౌండ్ సిస్టం మాయం అయిన విషయాన్ని గుర్తు చేశారు. నవంబర్ 12న పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ కు పిలిపించి ఎస్సై బి. సురేష్ విచారణ చేయగా, తాళాలు పగలకపోయినా, తలుపులు ఇరగకపోయినా దొంగతనం జరిగిందని, దీనికి 'ఇంటి దొంగలే కారణం' అనే అనుమానాలు వ్యక్తం చేశారని తెలిపారు. ఏఈఓ ప్రమేయం లేకుండా ఇది జరగదని కూడా స్పష్టంచేశారని అన్నారు. ఈ విషయాన్ని పై అధికారులకు నివేదించగా షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని,ఎన్నికల కోడ్ కారణంగా విచారణ వాయిదా పడిందని చెప్పారు.ప్రస్తుతం కూడా ఏఈఓ అనురిక విధులకు హాజరు కావడం లేదని,ఎన్నికల డ్యూటీ సమయంలో సెలవులు ఇచ్చే అధికారం ఎవరికీ లేదని శంభో శంకర్ స్పష్టం చేశారు.

## తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

(మొదటి పేజీ తరువాయి...)

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జూలూరుపాడు, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, ఇల్లందు, అల్లపల్లి, గుండాల, టేకులపల్లి మండలాల్లో తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జనరల్ అబ్జర్వర్ సర్వేశ్వర్ రెడ్డి, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ లావణ్య, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎన్నికల ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగం గా జిల్లాలోని ఏడు మండలాల్లో మొత్తం 155 గ్రామపంచాయతీలు, 1,330 వార్డులు ఉన్నాయని తెలిపారు. 155 గ్రామపంచాయతీలకు గాను రెండు గ్రామపంచాయతీలలో నామినేషన్లు దాఖలు కాలేదని, 8 గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని, మిగిలిన 145 గ్రామపంచాయతీలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా 1,330 వార్డులకు గాను మూడు వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదని, 256 వార్డులు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 1,071 వార్డులలో ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకుగాను అవసరమైన సిబ్బంది సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా అన్ని పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరిగిందని తెలిపారు. నేడు జరిగే పోలింగ్ సందర్భంగా అన్ని ఎన్నికల సిబ్బంది ఉదయం 7 గంటల కంటే ముందుగానే పోలింగ్ కు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఓటరును నిశితంగా పరిశీలించి పోలింగ్ కేంద్రంలోకి అనుమతించాలని, బ్యాలెట్ పేపర్లపై ఉన్న గుర్తులను సిబ్బంది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో అనవసరమైన ఇతర సామాగ్రి ఏదీ ఉండకుండా కట్టుదిట్టమైన నియంత్రణ పాటించాలని ఆదేశించారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు పూర్తయిన వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ పూర్తైన అనంతరం బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు తదితర ఎన్నికల సామాగ్రిని పూర్తిగా స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, అవకతవకలు లేదా పొరపాట్లు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ నివేదికలను సమయానుసారం ఎటువంటి అంతరాయం లేకుండా టి–పోల్ యాప్ లో నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరిగే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు కట్టుబడి, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా గ్రామపంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ★ , తుది విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక మరియు అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు చెప్పారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొబైల్ పట్రోలింగ్, చెక్ పోస్టుల ఏర్పాటు ద్వారా కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తామని వెల్లడించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ లో మరికొన్ని పరిశ్రమలు సంక్రాంతి నాటికి ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి...)

ఫుడ్ పార్క్ కు నాడు మంత్రిగా ఉన్న తుమ్మల పునాదులు వేశారు.పొలం నుంచి మార్కెట్ వరకు ఉత్పత్తుల విలువ పెంచే విధంగా ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల కోసం కోర్ ప్రాసెసింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సిపిసి హబ్ గా ఫుడ్ పార్క్ ఏర్పాటు ఉద్దేశ్యం. ప్రాదమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, సేకరణ కేంద్రాలు సీసీ లు సి పి సి కి మద్దతుగా ఉంటాయి. .బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ లో సిపిసి రెండు ,పి పి సి పూర్తి అయ్యాయి.మొత్తం ప్రాజెక్ట్ వ్యయం 109 కోట్లు అందులో 99 కోట్లు ప్రాజెక్ట్ వ్యయం కాగా మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి 28 కోట్లు గ్రాంట్ ఇచ్చారు. ప్రస్తుతం 26 ఎకరాల్లో 26 ప్లాట్స్ లో పలు కంపెనీలకు ప్లాట్స్ కేటాయించారు. గౌర్లాస్ గ్రీన్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ...ఇన్ఫినిటీ ఇండస్ట్రీస్ లకు ప్లాట్స్ కేటాయించారు. తాజాగా దీపక్ నెక్స్ జెన్ ఆక్వా ప్రాజెక్ట్ కు స్థలం కేటాయించారు. 615కోట్లు దీపక్ నెక్స్ జెన్ పెట్టుబడులు తో 3200 మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

**....గత ప్రభుత్వంలో పడావు పడ్డ ఫుడ్ పార్క్**

2016 లో నాడు పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు.తొమ్మిది ఏళ్ళు పూర్తయినా బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు మొదలవ్వ లేదు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరాక వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న తుమ్మల బుగ్గపాడు ఫుడ్ పార్క్ పనులు పురోగతి పై ప్రత్యేక దృష్టి సారించారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి ఇప్పటికే రెండు దఫాలు సమీక్ష నిర్వహించారు. నేడు జరిగిన సమావేశంలో అనుమతులు వేగవంతం చేసి, సంక్రాంతి నాటికి ఫుడ్ పార్క్ ప్రారంభం చేయాలని సంబధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

**...స్ట్రాటజిక్ లొకేషన్ లో మెగా ఫుడ్ పార్క్ రూపకల్పన చేసిన మంత్రి తుమ్మల**

**.... యువత ఉపాధికల్పనకు కేరాఫ్ గా మారనున్న బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్**

నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ పాలన అనుభవం కలిగిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ రంగంలో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ కు బాటలు వేసి తనదైన ముద్ర వేశారు. వ్యవసాయ ఉద్యాన పంటలకు సత్తుపల్లి అశ్వారావు పేట ప్రాంతాలు కేరాఫ్ గా ఉన్నాయి. దాంతో రైతాంగానికి మేలు చేసేలా పంట ఉత్పత్తులకు విలువ ఆధారిత మార్కెట్ పెంచేలా అగ్రి బై ప్రొడక్ట్స్ పరిశ్రమల స్థాపన జరిగేలా ఫుడ్ పార్క్ కు రూపకల్పన చేసారు.

**.....రోడ్డు రైల్వే పోర్ట్ కనెక్టివిటీ ఉండేలా స్ట్రాటజిక్ లొకేషన్ గా సత్తుపల్లి బుగ్గపాడు..**

మెగా ఫుడ్ పార్క్ కి నాడు మంత్రి తుమ్మల రూపకల్పన చేశారు.. 150 కి.మీ పరిధిలో వ్యవసాయ, ఉద్యాన , ఆక్వా , పౌల్ట్రీ లభ్యత దృష్ట్యా బుగ్గ పాడు లో వ్యూహాత్మక ప్రదేశం గా ఎంపిక చేసారు.. నేషనల్ హైవే రోడ్ నెట్ వర్క్స్.. ఎన్ హెచ్ 365B నుండి 22కి.మీ ఎన్ హెచ్ 216 నుండి 40 కి.మీ ఎన్ హెచ్ 65 నుండి 104 కి.మీ నాగపూర్ – విజయవాడ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి... రైల్ నెట్ వర్క్స్... కొత్తగూడెం రైల్వేస్టేషన్ 49కి.మీ ఖమ్మం రైల్వేస్టేషన్ 92 కి.మీ కొండపల్లి రైల్వే లింక్ 95 కి.మీ విమానాశ్రయం.. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం 111 కి.మీ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం 299 కి.మీ సముద్ర నౌకాశ్రయం.. కాకినాడ సముద్ర ఓడరేవు 184కి.మీ మచిలీపట్నం సముద్ర ఓడరేవు 170 కి.మీ వైజాగ్ సముద్ర ఓడరేవు 325 కి.మీ కృష్ణపట్నం సముద్ర పోర్ట్ 420 కి.మీ. కనెక్టివిటీ దృష్ట్యా స్ట్రాటజీకి లొకేషన్ లో మెగాఫుడ్ కోర్ట్ ఏర్పాటు తో ఖమ్మం జిల్లాతో పాటు చుట్టు ఉన్న జిల్లాలలో తెలంగాణ వ్యవసాయ రంగం లో విప్లవాత్మక మార్పులు తీసుకురానుందని మంత్రి తుమ్మల అన్నారు.. ఈ సమీక్ష సమావేశంలో ఇండస్ట్రీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ ఐఏఎస్, టి జి ఐ సి వైస్ ఛైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శశాంక ఐఏఎస్, కమిషనర్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డైరెక్టర్ ఆఫ్ బిజినెస్ సుష్మ , టి జి ఐ ఐ సి ఈ డి పవన్ కుమార్ , ఫుడ్ ప్రోస్సింగ్ సొసైటీ సభ్యులు శ్రీరామ్, ఆర్లిన్ తదితరులు పాల్గొన్నారు...

## 34 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి...)

తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆంధ్ర–ఒడిశా సరిహద్దు విభాగంలో చురుకుగా ఉన్నారు. రాష్ట్రప్రభుత్వం యొక్క సమగ్ర నక్సల్ నిర్మూలన విధానం, శాంతి, అభివృద్ధి ఆధారంగా పూనా మార్గెం పునరావాసం ద్వారా పునరుజ్జీవన ప్రచారం కారణంగా, 34 మంది మావోయిస్టు కార్యకర్తలు హింస మార్గాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. లొంగిపోయిన ఈ మావోయిస్టు లకు మొత్తం రూ. 84 లక్షల రివార్డును ప్రకటించారు.లొంగిపోయిన వారిలో సౌత్ సబ్ జోనల్ బ్యూరో (డి కె ఎస్ జెడ్ సి ) కేడర్లు అలాగే తెలంగాణ రాష్ట్ర కమిటీ ఏ ఓ బి డివిజన్‌తో సంబంధం ఉన్న మావోయిస్టులు ఉన్నారు. వీరిలో ఏడుగురు మహిళలు , 27 మంది పురుష కార్యకర్తలు ఉన్నారు. వారు భారత రాజ్యాంగంపై విశ్వాసం వ్యక్తం చేశారు. పోలీసుల కథనం ప్రకారం, జనవరి 1, 2024 నుండి బీజాపూర్ జిల్లాలో 824 మంది మావోయిస్టులు లొంగిపోయారు. 1,079 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, వివిధ ఎన్‌కౌంటర్లలో 220 మంది మావోయిస్టులు హతమయ్యారు. లొంగిపోయిన వారిలో డి వి సి ఏం పీ పీ సి ఏం , ఏ సి ఏం , పార్టీ సభ్యులు, పీ ఎల్ జి ఏ సభ్యులు, మిలిషియా ప్లాటూన్ కమాండర్లు సభ్యులు, ఆర్ పీ సి యొక్క సి యెన్ ఏం , జనతన సర్కార్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, డి కె ఏం ఎస్, కె ఏ ఏం ఎస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు వంటి వివిధ స్థాయిల నుండి వచ్చిన కార్యకర్తలు ఉన్నారు .డి ఆర్ జి , బస్తర్ ఫైటర్స్, ఎస్ టి ఎఫ్ , కోబ్రా బెటాలియన్ , సి ఆర్ పీ ఎఫ్ దళాల ఉమ్మడి ప్రయత్నాలు మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి తిరిగి తీసుకురావడానికి ప్రేరేపించాయి.పునరావాస విధానం కింద, లొంగిపోయిన ప్రతి కేడర్‌కు ప్రోత్సాహకంగా రూ. 50,000 తక్షణ ఆర్థిక సహాయం అందించబడుతుంది అని అధికారులు తెలియచేసారు .

**ఎస్పీ విజ్ఞప్తి:**

బీజాపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానం మావోయిస్టులను ఆకర్షిస్తోందని అన్నారు. వారి కుటుంబాలు కూడా వారు సాధారణ జీవితాన్ని గడపాలని సమాజంతో కలిసి నడవాలని కోరుకుంటున్నాయి. మావోయిస్టులు తప్పుదారి పట్టించే హింసాత్మక సిద్ధాంతాలను విడిచిపెట్టి, నిర్భయంగా సమాజంలోకి తిరిగి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పూనా మార్గెమ్ విధానం వారి భవిష్యత్తును సురక్షితంగా, గౌరవప్రదంగా స్వావలంబనగా మార్చడానికి సాధ్యమైన ప్రతి సౌకర్యాన్ని అందిస్తోంది అని అన్నారు .

# పామాయిల్ సాగుపై దేశవ్యాప్తంగా ఆసక్తి

- దమ్మపేటలో తెలంగాణ సాగు విధానాల అధ్యయనం
- మంత్రి తుమ్మల వ్యవసాయ క్షేత్రాలకు పొరుగు రాష్ట్రాల రైతుల సందర్శన



**దమ్మపేట, డిసెంబర్ 16, (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో పామాయిల్ సాగు ద్వారా సాధిస్తున్న అధిక దిగుబడులు, లాభదాయకమైన సాగు విధానాలు ఇతర రాష్ట్రాల రైతులను ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన రైతు బృందాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రాలను మంగళవారం సందర్శించాయి.ఈ పర్యటనలో రైతు బృందాలు పామాయిల్ తోటలను సమగ్రంగా పరిశీలించి సాగు తీరును ప్రత్యక్షంగా అవగాహన చేసుకున్నారు. పంట అభివృద్ధి, నీటి వినియోగం, ఎరువుల నిర్వహణ, దిగుబడులపై రైతులు అడిగిన ప్రశ్నలకు స్పష్టమైన వివరణలు అందాయి.మంత్రి వ్యవసాయ క్షేత్రాల్లో అమలవుతున్న ఆధునిక సాగు విధానాలను కాసాని నాగప్రసాద్ గౌడ్ తదితరులు రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా లాభాలు పొందే అవకాశాలు, అంతర పంటల సాగు వల్ల వచ్చే అదనపు ఆదాయం గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం పామాయిల్ సాగుకు అందిస్తున్న రాయితీలు, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి పొదుపు ప్రాధాన్యతను రైతులకు తెలియజేశారు.సాంప్రదాయ పంటలతో పోలిస్తే పామాయిల్ సాగు రైతులకు స్థిరమైన ఆదాయం కల్పిస్తుందని, మార్కెటింగ్ సమస్యలు తక్కువగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. క్షేత్ర స్థాయిలో సాగు విధానాలను చూసిన పొరుగు రాష్ట్రాల రైతులు తమ ప్రాంతాల్లోనూ ఇదే విధానాలను అమలు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, వ్యవసాయ రంగానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

## టిఎన్టియుసి నాయకుల అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం:ఐఎన్టియుసి

**బూర్గంపహాడ్, డిసెంబర్16, (ప్రజా జ్యోతి):** ఐటిసి పిఎస్పిడి అధికార కార్మిక సంఘం తెలుగుదేశం పార్టీ అనుబంధ టిఎన్టియుసి నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామని రాష్ట్ర కనీస వేతన మండలి సభ్యులు ఐటిసి పిఎస్పిడి ఐఎన్టియుసి ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాలతో సారపాక సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి కిషోర్ నాయక్ బరిలో నిలిచారని మిత్రపక్షాలు గెలుపుకు కృషి చేశారని నాయకులకు ధన్యవాదాలు తెలయజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ టిఎన్టియుసి నాయకులు కాంగ్రెస్ అధిష్టానానికి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతిస్తున్నట్లు తెలియజేస్తూనే సదరు కొంతమంది తెలుగుదేశం పార్టీ, టిఎన్టియుసి కార్మిక నాయకులు సారపాక లో గెలిచిన సర్పంచ్ అభ్యర్థి కిషోర్ శివరాం నాయక్ తమ పార్టీ అభ్యర్థియని చెప్పుకుంటూ ప్రజలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, అయోమయానికి గురి చేస్తున్నారన్నారని తెలిపారు.ఇది సరైన పద్ధతి కాదని టిఎన్టియుసి నాయకులను హెచ్చరిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలియజేస్తూనే చెబుతూనే వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా ప్రచారం ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో మీ పార్టీకి దిక్కు లేక,గెలిచిన అభ్యర్థులను తమ పార్టీ అభ్యర్థులుగా చెప్పుకుంటున్న మీకు సరైన సమయంలో ప్రజలు, కార్మికులు బుద్ధి చెబుతారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఉనికి లేదని కనీసం ఆఫీస్ కూడా లేదని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా సరే పొత్తుల్లో భాగంగా ఎవరితోనైనా పొత్తు పెట్టుకుని ముందుకు నడుస్తుందని కేవలం ఎమ్మెల్యే పాయం ఆదేశాలతోనే ఇక్కడ కాంగ్రెస్ వర్గాలు పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకున్నాయని పేర్కొన్నారు.రాబోయే జడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల్లో ఐఎన్టియుసి అనుబంధ సంస్థ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగానే పని చేస్తుందని పేర్కొన్నారు.టిడిపి అభ్యర్థిని పెడతామని ప్రకటించి ఎందుకు పెట్టలేదని రాబోయే ఎన్నికల్లో జడ్పిటిసి, ఎంపీటీసీ అభ్యర్థిగా టిడిపి పెడుతుందా అని ప్రశ్నించారు.గత ఎన్నికల్లో వైసీపీతో అనైతిక పొత్తు పెట్టుకుని ఇక్కడ అనైతిక రాజకీయాలు చేశారని మీలాంటి వారు సిగ్గులేకుండా ఇలాంటి దుష్ప్రచారం తగదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన కిషోర్ శివరాం నాయక్ కి మద్దతు ఇచ్చి గెలిపించుకున్నామన్నారు.ఇకనైనా పద్ధతి మార్చుకొని ప్రజలకు కార్మికులకు తప్పుడు సమాచారం అందించకుండా మీ దృష్టి జరగబోవు 14వ వేతన ఒప్పందంలో పెట్టి మంచి వేతన ఒప్పందం చేయాలని ఇప్పుడు ఉన్నటువంటి ప్రమాణాల ప్రకారం వేతనం రూపాయలు 21000/– పెరగాలని లేనిపక్షంలో కార్మికుల నుండి తిరుగుబాటు తప్పదని హెచ్చరిస్తున్నామని అన్నారు.ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి,చల్ల వెంకట నారాయణ,గొల్లమారి చంద్రశేఖర్ రెడ్డి, ఐ శ్రీనివాసరావు,జక్కుల శీను,పి రాజశేఖర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుడైన ఐటీడీఏ పీవో రాహుల్

- జిపిఎస్ పాఠశాలల ఆకస్మిక తనిఖీ
- చిన్నారులకు ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు తప్పనిసరిగా బోధించాలి





**చర్ల, డిసెంబర్ 16 :(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం మారుమూల అటవీ ప్రాంతంలోని గ్రామాలైన వద్దిపేట, ఉంజుపల్లి గిరిజన సంక్షేమ శాఖ జిపిఎస్ పాఠశాలలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రత్యేకంగా ఉపాధ్యాయుని పాత్ర పోషించి పిల్లల చేత బోర్డుపై అక్షరమాల అధికారుల యొక్క పేర్లు ఎలా రాయాలో పిల్లల చేత రాయించారు. ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు, చతుర్వేద పదాలు, గణితంలోని కూడికలు తీసివేతలు, ఇంగ్లీషు సంబంధించిన పదాలు పిల్లలను అడిగిన వెంటనే బోర్డుపై రాయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన చిన్నారుల విద్యాభ్యాసం బలోపేతం చేయడానికి ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టడం జరిగిందని, చాలావరకు గిరిజన చిన్నారులు వర్క్ బుక్ లోని అంశాలు అర్థం చేసుకొని చదవడం, రాయడం చేస్తున్నారని, ఇంకా ఎవరైనా పిల్లలు వర్క్ బుక్కులోని అంశాలు అర్థం చేసుకోవడంలో వెనుకబడి ఉంటే సంబంధిత ఉపాధ్యాయులు వారిపై దృష్టి పెట్టి ప్రత్యేకంగా రాయించాలని ఉపాధ్యాయులకు సూచించారు.సంబంధిత ఎస్సిఆర్పీలు తప్పనిసరిగా వారి పరిధిలోని పాఠశాలలను ప్రతిరోజు పర్యవేక్షించాలని, ఉద్దీపకం వర్క్ బుక్ నిర్వహణ ఏ పాఠశాలలో అయితే సక్రమంగా జరగడం లేదో గమనించి ఆ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతిరోజు గిరిజన చిన్నారులకు ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు తప్పనిసరిగా ఉపాధ్యాయులు బోధించే విధంగా చూడాలని అన్నారు. అనంతరం చర్ల నుండి పూసుగుప్ప రోడ్డు మార్గంలోని రొట్టెటి వాగు బ్రిడ్జి నిర్మాణం 4 కోట్ల 30 లక్షల వ్యయంతో చేపడుతున్న పనులను పరిశీలించి నిర్మాణం పనులు నాణ్యతగా ఉండేలా చూడాలని, సకాలంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యేలా చూసి గిరిజనుల రాకపోకలకు తొందరగా వెసులుబాటు కల్పించేలా కాంట్రాక్టర్లు త్వరితగతిన పనులు చేయించి సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ టి ఏ శ్రీనివాస్, ఎస్ సి ఆర్ పి జయ ప్రకాష్, ఉపాధ్యాయులు రాజ్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఓసిని త్వరితగతిన ప్రారంభించాలి



**ఇల్లందు, డిసెంబర్ 16, ప్రజాజ్యోతి:** జెకె 5 ఓసి పొడగింపు ప్రాజెక్ట్ (పూసపల్లి) ఓసిని త్వరితగతిన ప్రారంభించాలని ఇల్లందు ప్రాతినిధ్య సంఘ ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఇల్లందుకు వచ్చిన సింగరేణి డైరెక్టర్ (పి అండ్ పి) కొప్పుల వెంకటేశ్వరరావును ఐఎన్టియుసి నేతలు కలిశారు. జెకె 5 ఓసి పొడగింపు ప్రాజెక్ట్ (పూసపల్లి) ఓసి ఎప్పుడు ప్రారంభిస్తున్నారని అడుగగా 2026 ఫిబ్రవరి, మార్చి నెలల్లో పనులు ప్రారంభమవుతాయని డైరెక్టర్ తెలిపినట్లు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## అమరజీవి రావి సీతారామయ్యకు ఘన నివాళులు



**దమ్మపేట, డిసెంబర్ 16, (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో అమరజీవి కామ్రేడ్ రావి సీతారామయ్య మూడవ వర్ధంతిని మంగళవారం సిపిఎం గ్రామ శాఖ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి కొలికిపోగు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రావి సీతయ్య స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ ఎగురవేశారు. అనంతరం మండల కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్ధంతి సభలో పలువురు నాయకులు పాల్గొని సీతయ్య ప్రజా పోరాటాలను స్మరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మండల బీసీ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



**ఇల్లందు, డిసెంబర్ 16, ప్రజాజ్యోతి:** ఇల్లందు మండల బీసీ సంఘం అధ్యక్షులుగా బండి వెంకటేశ్వర్లు ముదిరాజును మంగళవారం జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు అంకినీడు ప్రసాద్ నియమించారు. బండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనపై నమ్మకం తో జాతీయ బీసీ సంఘం ఇల్లందు మండల అధ్యక్షునిగా నియమించిన అంకినీడు ప్రసాద్, జాతీయ, రాష్ట్ర జి ల్లా బీసీ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం జాతీయ బీసీ సంఘం ఆదేశాల మేరకు కృషి చేస్తానని తెలిపారు.

## సర్పంచ్ కు సన్మానం



**చర్ల, డిసెంబర్ 16: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం పాస్టర్లు యాక. రామారావు, ఇర్ప. వెంకటేశ్వర్లు మిగతా పాస్టర్స్ ఆధ్వర్యంలో ఉప్పరిగూడెం గ్రామసర్పంచ్ గా బి ఆర్ ఎస్ పార్టీ బలపర్చిన సోయం. నాగలక్ష్మి గెలిపొందిన సందర్భగా వారి స్వగృహం వద్ద శలువా పూలదండతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారం దిశ గా పనిచేస్తూ ఉప్పరగూడెం పంచాయతీని అభివృద్ధి చేసే విధంగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్తమంలో వార్డ్ మెంబర్లు ఇర్ప. సూరిబాబు, కల్లూరి. శ్రీను, సోయం. రమాదేవి గ్రామ పెద్దలు ఇర్ప. రాజారావు, సోయం. వెంకటేశ్వర్లు, సోయం. సురేష్ పాల్గొన్నారు.

# సింగరేణి సీఎండీగా డి.కృష్ణ భాస్కర్ బాధ్యతల స్వీకరణ



**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 16 ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ప్రస్తుత సీఎండీ ఎన్.బలరామ్ ఏడు సంవత్సరాల డిప్యూటేషన్ అనంతరం మాతృ విభాగానికి తిరిగి వెళుతున్న నేపథ్యంలో సింగరేణికి సీఎండీ (ఎఫ్ఏసీ)గా దేవరకొండ కృష్ణ భాస్కర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆయన సింగరేణి భవన్ లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుత ఛైర్మన్ శ్రీ ఎన్. బలరామ్ నుండి బా ధ్యతలను తీసుకున్నారు. ఆయనకు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు స్వాగతం పలికారు. డి.కృష్ణ భాస్కర్ 2012 బ్యాచ్ కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన తెలంగాణ ట్రాన్స్ కో సీఎండీగానూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల స్పెషల్ సెక్రటరీగానూ బా ధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఆయన రాజన్న సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాలకు కలెక్టర్ గా విధులు నిర్వహించారు. తెలంగాణ ఇండస్ట్రీస్ శాఖకు డైరెక్టర్ గానూ, రాష్ట్ర ఆర్థిక మరియు ప్రణాళిక శాఖకు స్పెషల్ సెక్రటరీ గానూ వ్యవహరించారు.

# ఎమ్మెల్యే ని కలిసిన సర్పంచ్ లు



**చర్ల, డిసెంబర్ 16:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన గెలుపొందిన పదిమంది సర్పంచ్ లు , ఉప సర్పంచులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చీమలమర్రి మురళి, పోలిన లంక రాజు, ఇర్ప వసంత్, పోట్రూ బ్రహ్మానంద రెడ్డి, నాయకత్వం లో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు గారిని కలవడం జరిగింది. ఎన్నికలలో గెలిచిన వారు సుబ్బంపేట కాకా సత్యనారాయణ, సి, కత్తిగూడెం ఇర్ప ఉమా, మొగలపల్లి కుప్పా సత్యవతి,గొమ్ముగూడెం కనితి రమాదేవి , సత్యనారాయణపురం చిక్కాల గౌతమి, కలివేరు తెల్లం లక్ష్మణరావు, దేవర పల్లి తెల్లం సుజాత, బోదినెల్లి వజ్జం సింగయ్య , పెద్దపల్లి కనితి రామకృష్ణ కేసవాపురం కాపుల శారద .ఈ సందర్భంగా సర్పంచ్ లను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సన్మానించారు . ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట రావు మాట్లాడుతూ ప్రతి పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలని కోరారు. సర్పంచ్ లందరికి ఎమ్మెల్యేగా నా వంతు సహాయం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ముమ్మినేని అరవింద్, గుండేపూడి సతీష్,రామ్ పండు, అలవాల బాలు, చల్లకోటి వాసు, కట్ట అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

# రామాలయంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్

- అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన

**భద్రాచలం, డిసెంబర్ 16,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దేవస్థానం సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. అగ్నిమాఫక శాఖ అధికారి ఆద్వర్యంలో వివిధ పరికరాల సహాయంతో ఏ విధంగా అగ్ని ఏర్పడుతుంది, ఆ సమయంలో తీసుకోవలసిన నివారణ చర్యలను వారికి వివరించారు.



# క్రీడాస్ఫూర్తితో గెలుపోటములను సమానముగా స్వీకరించాలి

- కంపెనీ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు
- ప్రారంభించిన ఇంచార్జ్ జీఎం ఎం.వి నరసింహారావు








**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 16 ప్రజాజ్యోతి:** సింగరేణి కాలరీస్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం రుద్రంపూర్ లో మంగళవారం నుండి 3 రోజులపాటు కంపెనీ స్థాయి పురుషుల క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎం.వి నరసింహారావు, విశిష్ట అతిధిగా జిఎం (పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ విచ్చేశారు. ముందుగా ముఖ్య అతిధి, విశిష్ట అతిధి మరియు వేదికపై ఆశీర్నులైన ప్రముఖులతో జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం ముఖ్య అతిధి ఇంచార్జి జనరల్ మేనేజర్ ఎం.వి. నరసింహారావు గారు ఒలంపిక్ పతాక ఆవిష్కరణ చేసి, బెలూన్ లను ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 2025-26 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ స్థాయి పురుషుల క్రికెట్ పోటీలను సింగరేణి కొత్తగూడెం ఏరియా నిర్వహించుకోవటం చాలా సంతోషం అని, క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని, క్రీడలు అనేవి శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని, ఈ క్రీడా పోటీలలో గెలుపు ఓటములను సమానముగా తీసుకోవాలని తెలుపుతూ ఈ పోటీలలో పాల్గొనే కంపెనీ పరిధిలోని మూడు రీజియన్ లలో ఉన్న ఆరు (6) జట్లు అయిన కొత్తగూడెం అండ్ కార్పొరేట్, ఇల్లందు & మణుగూరు, భూపాలపల్లి & ఆర్జీ-3, ఆర్జీ-1 & ఆర్జీ-2, బెల్లంపల్లి & మందమర్రి, శ్రీరాంపూర్ ల రీజియన్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రికెట్ పోటీలలో క్రీడాకారులు ఎటువంటి గాయాలు తగలకుండా జాగ్రతలు తీసుకుంటూ, స్నేహభావం తో ఈ 3 రోజుల క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

**మొదటి రోజు ఆటల పోటీల వివరాలు :** ఈరోజు ఉదయం ప్రొఫెసర్ జయ శంకర్ స్టేడియం, రుద్రంపూర్ నందు కొత్తగూడెం & కార్పొరేట్ మరియు భూపాలపల్లి & ఆర్జీ-3 టీం లతో క్రికెట్ పోటీలు ప్రారంభించుకోవడం జరిగింది. ఇందులో ముందుగా టాస్ గెలిచిన కొత్తగూడెం & కార్పొరేట్ టీం వారు బౌలింగ్ ఎంచుకున్నారు. భూపాలపల్లి & ఆర్జీ-3 టీం 16 ఓవర్లకు 110 పరుగులు చేసి ఆల్ అవుట్ (10 వికెట్స్) కావడమైనది. లక్ష్య చేధనలో భాగంగా కొత్తగూడెం & కార్పొరేట్ టీం నాలుగు వికెట్లు కోల్పోయి 14వ ఓవర్ లలోనే గెలుపొందడం జరిగింది. అలాగే ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం (కార్పొరేట్) నందు ఇల్లందు & మణుగూరు టీం తో బెల్లంపల్లి & మందమర్రి టీంలకు క్రికెట్ మ్యాచ్ జరుగుతుంది. ఇందులో టాస్ గెలిచిన బెల్లంపల్లి & మందమర్రి టీం బ్యాటింగ్ ఎంచుకొని 18 ఓవర్లకు ఏడు వికెట్లు కోల్పోయి 131 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగింది. రెండో ఇనింగ్స్ ఇల్లందు & మణుగూరు టీం వారు కూడా 18 ఓవర్లు కు 8 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి ఈ మ్యాచ్ ట్రై బ్రేకర్ గా ముగియడంతో గ్రౌండ్ ఇరుజట్లకు చెరొక పాయింట్లు ఇవ్వడం జరిగింది. అలాగే రెండవ మ్యాచ్ ప్రకాశం స్టేడియం, కొత్తగూడెం (కార్పొరేట్) నందు ఇల్లందు & మణుగూరు టీం తో ఆర్జీ-1 & ఆర్జి-2 టీం లకు నిర్వహించగా మొదటగా బ్యాటింగ్ చేసిన ఆర్జీ-1 & ఆర్జి-2 టీం 16 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 126 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగింది ఈ లక్ష్య చేధనలో భాగంగా రెండో ఇన్నింగ్స్ ఇల్లందు & మణుగూరు ఏరియా టీమ్ వారు ఐదు వికెట్లు కోల్పోయి 16 ఓవర్ లాస్ట్ బాల్ కు గెలుపొందడం జరిగింది. ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం, రుద్రంపూర్ నందు రెండవ మ్యాచ్ శ్రీరాంపూర్ టీం తో ఆర్జి-3 & భూపాలపల్లి టీం లకు పోటీ పడగా ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీరాంపూర్ టీం వారు 18 ఓవర్లు కు 8 వికెట్లు కోల్పోయి 121 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు ఈ లక్ష్యన్ని ఆర్జీ-3 & భూపాలపల్లి టీం వారు 17 వారు చివరి బంతికి ఆరు వికెట్లు కోల్పోయి 123 పరుగులతో విజయాన్ని సాధించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇన్చార్జి జిఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఎఐటియూసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, ఏజీఎం (సివిల్) సిహెచ్. రామకృష్ణ, ఎజిఎం (పర్సనల్) జీ.వి. మోహన్ రావు, డిజిఎం (పర్సనల్) బి.శివ కేశవరావు, స్పోర్ట్స్ మేనేజర్ కే.సునీల్, డివై పిఎం జి. హరీష్, స్పోర్ట్స్ సూపర్వైజర్ లు, పర్సనల్, ఎస్&పిసి, ఈ&ఎం, సివిల్ శాఖల సిబ్బంధి, ఆరు (6) జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించాలి

- జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట





**చర్ల, డిసెంబర్ 16 (ప్రజా జ్యోతి ):** మంగళవారం దుమ్ముగూడెం, చర్ల మండలంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థినిలు బోధన సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేజీబీవిల లోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటగది, తాగునీటి సౌకర్యాలు, టాయిలెట్ బ్లాకులను తనిఖీ చేసి విద్యార్థినిలకు వండిన ఆహారాన్ని విద్యార్థినిలతో కలిసి భోజనం చేసారు . అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలకు ప్రభుత్వం నూతనంగా మెనూ ప్రకారం ప్రతి రోజు అల్పాహారం దగ్గర నుండి రాత్రి భోజనం వరకు సక్రమంగా వంటచేసి వడ్డించాలని, వంట సిబ్బంది పరిశుభ్రతతో పాటు వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలు తినే ముందు ఉపాధ్యాయులు సిబ్బంది ముందుగా భోజనం చేసిన తర్వాతనే పిల్లలకు వడ్డించాలని అన్నారు. అలాగే విద్యార్థినిల ఆరోగ్య విషయంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థినిల ఆరోగ్యంతో పాటు తగిన భద్రత మరియు వారి యోగక్షేమాలు సంబంధిత ప్రిన్సిపాల్ పర్యవేక్షిస్తూ ఉండాలని, జిల్లాలో ఉన్న ఆరు కేజీబీవీ లలో అనారోగ్య (సిక్ రూమ్స్ ) గదులలో విద్యార్థినిలకు సరైన పడకలు లేవని గమనించి, చర్ల, దుమ్ముగూడెం, కరకగూడెం, పినపాక, బూర్గంపాడు, భద్రాచలంలో కేజీబీవీ లలో అనారోగ్య గదులకు పడకలు ఇతర ముఖ్యమైన చిన్న అవసరాలను వెంటనే ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని, విద్యార్థినీలలో కంప్యూటర్ అక్షరాస్యతను పెంపొందించడంతో పాటు ఇంగ్లీష్ కమ్యూనికేషన్ రచన నైపుణ్యాలను బలోపేతం చేయడానికి తగిన సూచనలు, సలహాలు విద్యార్థినిలకు అందించారు.

# పద్మావతి ఖని నందు 56వ వార్షిక భద్రత పక్షోత్సవాలు





**కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 16 ప్రజాజ్యోతి:** 56వ వార్షిక భద్రత వారోత్సవాల సందర్భంగా కొత్తగూడెం ఏరియా పద్మావతి ఖనిలో భద్రత వారోత్సవ కార్యక్రమం జరిగినది. దీనిలో భాగంగా భద్రత వారోత్సవాల తనిఖీ బృందంను ఆహ్వానించడం జరిగినది. ఈ కార్యక్రమాన్నికి సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్స్) కె.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వార్షిక భద్రత వారోత్సవాల సందర్భముగా ముందుగా కొత్తగూడెం ఏరియా ఇంచార్జి జనరల్ మేనేజర్ ఎం.వి నరసింహ రావు డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్స్) కి పుష్ప గుచ్ఛంతో ఆహ్వానించారు. అలాగే వార్షిక భద్రత వారోత్సవాల కమిటీ సభ్యులు, పద్మావతి ఖని ఏజెంట్ రామ్ భారస్ మెహత, మేనేజర్ ఎం.వి. శ్యామ్ ప్రసాద్ పద్మావతి ఖని సిబ్బంది, ఉద్యోగులు అందరితో కలసి రక్షణ ప్రతిజ్ఞ చేశారు. రక్షణ ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా కళా బృందం వారు భూగర్భ గనిలో పనితీరును వివరించేలా చిరు నాటికను ప్రదర్శించి ఉద్యోగస్తులకు రక్షణ సూత్రాలను మరోమారు గుర్తు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... సింగరేణి సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని భద్రతతో కూడిన బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను చేయాలని వారి ముఖ్య ఉద్దేశమని జీరో హాం తో బొగ్గు ఉత్పత్తి చేయాలని వారు వారి యొక్క ప్రతి సమావేశంలో మరియు మాటలలో తెలియజేస్తూ ఉంటారని అన్నారు. ఈ భద్రత వారోత్సవాలలో భాగంగా భూగర్భ గనిలో, ఉపరితల గనులలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగి రక్షణకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తూ వారు పనిచేసేటప్పుడు పని మీదే ధ్యాస ఉంచినట్లయితే ఎలాంటి యాక్సిడెంట్లు అవ్వకుండా చూసుకోవచ్చని, ప్రతి ఒక్క ఉద్యోగి వారికి కేటాయించిన పని స్థలాల్లో భద్రతతోని పని చేసినట్లయితే సింగరేణిలో జీరో పర్సెంట్ యాక్సిడెంట్ గా మనం ముందుకు వెళ్లడానికి ఆస్కారం ఉంటుందని, అలాగే ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ నీ పక్కన పెట్టి మనకు కేటాయించిన పనిని పూర్తి చేసినచో ఎలాంటి ప్రమాదాలు జరగవని, అలాగే బైక్ మీద వెళ్ళేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి కొత్తగూడెం ఏరియా జీఎం తో పాటు వార్షిక భద్రత వారోత్సవాల కమిటీ సభ్యులు, జీఎం సేఫ్టీ సాయి బాబు, జీఎం సైదులు, తివారి, వెంకటేశ్వర్లు, మేనేజర్ ఎం.వి. శ్యామ్ ప్రసాద్, కొత్తగూడెం ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ వి.మల్లికార్జున రావు, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం డి రజాక్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి గుర్తింపు ఉద్యమం2025 పై సమీక్ష శిక్షణ కార్యక్రమం





**కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబర్ 16, ప్రజా జ్యోతి** కుష్టు వ్యాధి గుర్తింపు ఉద్యమంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష సమావేశం, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్ మాట్లాడుతూ శరీరంపై రాగి వర్ణంలో లేదా చర్మ రంగుకంటే తక్కువ రంగులో మచ్చలు కనిపించి, ఆ మచ్చలపై స్పర్శ (సెన్సేషన్) లేకపోతే కుష్టు వ్యాధిగా అనుమానించాల్సిందిగా సూచించారు. అటువంటి వ్యక్తులను వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించి వైద్యాధికారులచే పరీక్షలు నిర్వహించి గుర్తించాలని తెలిపారు. ఈ మచ్చలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో అంగవైకల్యం ఏర్పడి కుటుంబానికి భారంగా మారే ప్రమాదం ఉందని, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. జిల్లా ప్రజలందరూ 14 రోజుల కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ గుర్తింపు ఉద్యమం ఈ నెల 18వ తేదీ నుండి 31వ తేదీ వరకు 14 రోజుల పాటు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో ఆశ కార్యకర్తలు ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు ప్రతి ఇంటిని సందర్శించి ప్రతి వ్యక్తిని పరిశీలించడం జరుగుతుందని, ఈ సర్వేను విజయవంతంగా పూర్తిచేయాలని ఆశ కార్యకర్తలను కోరారు. ప్రస్తుతం జిల్లాలో 45 కుష్టు వ్యాధి కేసులను గుర్తించి వారికి ఉచితంగా మందులు అందించడం జరుగుతోందని తెలిపారు. జిల్లా ఏర్పాటు అయినప్పటి నుండి ఇప్పటివరకు మొత్తం 582 కుష్టు వ్యాధి కేసులను గుర్తించి చికిత్స అందించగా, అందులో 532 మంది పూర్తిగా చికిత్స పొంది ఆరోగ్యవంతులుగా మారారని వివరించారు. ఈ గుర్తింపు ఉద్యమంలో మొత్తం 2,29,336 ఇండ్లను, 1,407 మంది ఆశ కార్యకర్తలు పాల్గొని సందర్శించన్నారని అన్నారు, గత మార్చి నెలలో నిర్వహించిన కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో 2,29,336 గృహాలను సందర్శించి 1,702 అనుమానిత కేసులను గుర్తించగా, అందులో 25 మందికి కుష్టు వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందించడం జరిగిందన్నారు

**గత సంవత్సరాల వారీగా గుర్తించిన కేసుల వివరాలు:** 2019లో – 62 కేసులు 2022–23లో – 38 కేసులు, 2023–24లో – 36 కేసులు, 2024లో – 25 కేసులుఅనంతరం డిప్యూటీ డీఎంహెచ్ వో జయలక్ష్మి , మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విధిగా సమయపాలన పాటించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బంది అందరూ అటెండెన్స్ రిజిస్టర్, మూమెంట్ రిజిస్టర్ లను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. అలాగే ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీల ప్రసవ క్యాలెండర్లను సక్రమంగా నిర్వహిస్తూ, ప్రమాదకర గర్భిణీ స్త్రీలను ముందస్తుగా గుర్తించి అవసరమైతే ఆసుపత్రిలో అడ్మిట్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రసాద్, ఎన్ ఎల్ ఈ పి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి బద్రు పీటీ మోహన్, డీపీఎం , డీపీఓ సరిత , జిల్లా వైద్యాధికారులు, నోడల్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటి వరకు 250 కోట్ల మంది మహా లక్ష్మి పథకం కింద లబ్ది పొందారు

- ప్రయాణీకుల భద్రతే మా ప్రథమ లక్ష్యం
- భద్రాచలంలో విలేకర్ల సమావేశంలో ఆర్టీసీ సంస్థ ఎండి నాగిరెడ్డి



**భద్రాచలం, డిసెంబర్ 16,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో రాష్ట్ర ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఆర్టీసీ అధికారులతో డిపో, అంతరాష్ట్ర బస్సు సర్వీల విధానంపై చర్చించారు. అలాగే డిపోలో నెలకొన్న సమస్యలు, వాణిజ్య సముదాయాల వస్తున్న ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 10 వేల బస్సుల్లో ప్రతి రోజు 60 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నామని, భద్రాచలం పుణ్యక్షేత్రం కావడంతో ప్రయాణీకులకు మరిన్ని సేవలందించేలా నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. పుణ్యక్షేత్రాలకు సైతం మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్కువగా సద్వినియోగం చేసుకోవడంతో ఆలయాలకు సైతం ఆదాయం గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు. రెండేళ్లలో 2,500 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, స్వయం సహాయక సంఘాల ద్వారా మరో 600 బస్సులు కొత్తగా వారికి అప్పగించామని వివరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా ఎలక్టికల్ బస్సులనే నడుపుతామని, ఇప్పటికే హైదరాబాద్‌తో అనుసంధానమై ఉన్న పరిసర గ్రామాలన్నింటికి ఎలక్ట్రికల్ బస్సులను తిప్పుతున్నామన్నా. ఆర్టీసీ సంస్థ ప్రయాణీకుల భద్రతకే ప్రధమ ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. ఆర్టీసీ సంస్థ ప్రస్తుతం లాభాలతోనే నడుస్తోందని, ఆదాయ, వ్యయాలు పెరగడం తగ్గడమనేది నిరంతర ప్రక్రియని పేర్కొన్నారు. మహాలక్ష్మీ పథకం కింద కొంత మేరకు లాభాలు మెరుగయ్యాయన్నారు. అలాగే ఆర్టీసీకీ ప్రధాన సమస్యగా ఉన్న ప్రయవేటు బస్సులు ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో నిలపడాన్ని పూర్తిగా అరికట్టేందకు రవాణ శాఖ మంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే అన్ని డిపోల పరిధిలో ప్రజలకు అనుకూలమైన సమయాల్లో మరిన్ని బస్సులు తిప్పడంపై ఆయా డిపోల డీఎంలు నిర్ణయం తీసుకుంటారని ప్రజలు ఇందుకు సహకరించాలన్నారు. భద్రాచలంకు సంబంధించి అంతరాష్ట్ర డిపో పర్మిట్ పరిధి మేరకు ఏపీకి బస్సులు నడుపుతామని, మరొన్ని బస్సులను పెంచాలనే విజ్ఞప్తిపై ఏపీ అధికారులతో సంప్రదిస్తామని అన్నారు. తెల్లవారుజాము సమయాల్లో బస్సులను పెంచడంపై పరిశీలిస్తామన్నారు.

## భద్ర్రాద్రిలో ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు



**భద్రాచలం, డిసెంబర్ 16, ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం 11.45కి పవిత్ర గోదావరి నుంచి తీర్ధ బిం దెను తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలోని మూలవరులకు ఏకాంత అభిసే కం నిర్వహించారు. అలాగే మాధ్యమిక ఆరాధన చేసి అమ్మవారికి పొంగలి సమర్పించారు. అలాగే మధ్యాహ్నం తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి నివేదన చేశారు. అదేవిధంగా ధనుర్మాస ప్రాశస్యంను వివరించారు. అదేవిధంగా ఆలయంలో మంగళవారంను పురస్కరించుకొని దాసాంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

## ఘనంగా ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు





**అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 16, ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల 57 నిమిషాలకు ధనుర్మాసం ఆరంభం కావడంతో వైష్ణవ సంప్రదాయాల ప్రకారం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసం అనేది సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించే కాలాన్ని సూచించే పవిత్ర మాసం. ఈ సమయంలో దేవతలకు ఇది ప్రాతఃకాలంగా భావించబడటంతో తెల్లవారుజామున శ్రీ మహావిష్ణువారిని ఆరాధించడం విశేష ఫలితాలను ఇస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే ఈ మాసంలో వైష్ణవ ఆలయాల్లో సుప్రభాత సేవలు, తిరుప్పావై పఠనం ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ధనుర్మాసంలో నియమ నిష్ఠలతో చేసే పూజలు పాపనాశనం చేసి భక్తులకు ఆధ్యాత్మిక శుద్ధిని కలిగిస్తాయని విశ్వాసం. ఈ కారణంగానే ధనుర్మాసాన్ని వైష్ణవ సంప్రదాయంలో అత్యంత ముఖ్యమైన మాసంగా భావించి ఘనంగా పాటిస్తారు. ఈ ధనుర్మాసం మొత్తం 30 రోజుల పాటు కొనసాగుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ మాసం సందర్భంగా ప్రతిరోజూ తెల్లవారుజామున ప్రత్యేక సుప్రభాత సేవతో పాటు మధ్యాహ్నం నుంచి కూడా ప్రత్యేక పూజలు బ్రహ్మాండంగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయాన్ని పుష్పాలు, దీపాలతో సుందరంగా అలంకరించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తిశ్రద్ధలతో మంత్రోచ్చారణలతో మార్మోగాయి. ధనుర్మాసంలో చేసే పూజలు భక్తుల జీవితాల్లో శాంతి, సుఖసమృద్ధి, ఆధ్యాత్మిక శక్తిని పెంపొందిస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ మాసమంతా ప్రత్యేక కార్యక్రమాలతో ఆలయం భక్తులతో కళకళలాడనుంది.

# ఐఎల్‌పీఏ ఐదవ రాష్ట్ర మహాసభ కర పత్రం ఆవిష్కరణ



**భద్రాచలం,డిసెంబర్ 16,ప్రజాజ్యోతి :** భద్రాచలం న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయవాదుల సంఘ సభ్యుల సమక్షంలో ఐఎల్‌పీఏ ఐదవ రాష్ట్ర మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని న్యాయమూర్తి వి. శివ నాయక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి ఏ. దుర్గాభవాని, ప్రభుత్వ అభియోజకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు కోట దేవదానం, కార్యదర్శి పుసాల శ్రీనివాస చారి తో పాటు న్యాయవాదులు విద్యాసాగర్, అంబేద్కర్, చేతన్య తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు ఐఎల్‌పీఏ ఐదవ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన వారందరికీ ఐఎల్‌పీఏ భద్రాచలం కమిటీ తరపున అవులూరి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు